# అధరం దాటని రాగం

జడలోంచి జాజుల పరిమళం - అధరాలపైనుంచి చిరునవ్వులూ.... వొస్తుందొస్తుంది పల్లవి వొస్తుంది.

జావళి... తిల్లాన... రాగమాలిక... అష్టపది... లాభం లేదు డియర్ మిస్టర్ శశిధర్... పల్లవి పలకాలంటే పదము కావాలి... సంగీత రచనకు ఏ అక్షరాలు పాదిగినా పర్లేదోయ్... కాని జీవన పల్లవి వెల్లువై ఉప్పొంగాలంటే గుండెలో రాగముంటె చాలదోయ్... అధరం పలుకని రాగం - అనురాగం లోయల పూసే గీతమో ... లోకం వినని గీతమోయ్...

అవునా... అయితే పల్లవి... అనుపల్లవి... చరణాలు లేని సాధారణ గీతం 'సంచారి'ని పల్కరించావేం... 'నీ సరీ రీ॥ నిసరిమగరిగ॥ ...

"కూలి, కూలీ"...

శశిధర్ తలతిప్పి చూశాడు. 'సికింద్రాబాద్' బోర్డు కన్పించింది.

శశిధర్ స్టేషన్ బయటికి వచ్చాడు. ఆటో ఎక్కి ఎక్కగానే అతని ఎదలో పల్లవి జ్ఞాపకాలు చిరుమువ్వల దివ్యరాగమై కదిల్తే...

అవి శశిధర్ జంటనగరాలొచ్చిన తొలిదినాలు. పత్రికాఫీసులో ఉద్యోగం. నేస్తం మురళితో గదిలో జీవితం. ప్రతిరోజా అతని మదిలో పల్లవి మెదుల్తుండేది.

పల్లవి రూపం తెలియదతనికి. కాని ఆమె పాటలు రేడియోలో విన్నాడు. ఆమె అడ్రస్ సంపాదించి ఆమె దగ్గరికి వెళ్లొచ్చు. ఆమె ఫోజ్ కొడుతుందేమోనని అతని భయం. ఆమె గురించి మురళితో మాట్లాడ్డానికి కూడా అతను ఇష్టపడేవాడు కాదు.

ఒకరోజా ఆఫీసులో కూర్చుని ఇంటినుండి వచ్చిన ఉత్తరం చదువుతుంటే "శశిధర్, ఈమె పల్లవి. రేడియోలో పాటలు పాడతారు. ఆదివారం అనుబంధంలో ప్రచురించిన గీత

రచయిత ఎడ్రస్ కావాలంట. అవి చూస్తుంది మీరేగా" ఆమెని శశిధర్‌కి పరిచయం చేస్తూ అడిగాడు కొలీగ్ ప్రభాకర్.

ఆమెని చూస్తుంటే చైత్రమాసపు జీడి మామిడి పూల పరిమళం స్ఫురిస్తుంటే 'అవును' అన్నాడు శశిధర్.

శశిధర్ ఇచ్చిన అడ్రస్ తీసుకుని "థ్యాంక్స్" చెప్పి వెళ్ళిపోయిందామె.

ఎప్పుడైనా నాపాట విన్నారా? అనికూడ అడగలేదేంటామె అనుకున్నాడతను.

★ ★ ★

ఆదివారం ఉదయం పదిగంటలు. పేవ్‌మెంట్‌పై అమ్మే పాత పుస్తకాలు చూస్తున్న శశిధర్‌ని పలకరించింది పల్లవి.

"మీ అభిమాన రచయిత ఎవరు?" అడిగిందామె.

"బుచ్చిబాబు" చెప్పాడతను.

"అతని రచనల్లో ఏమిష్టం?"

"చివరికి మిగిలేది? కాఫీ తాగుదాం వస్తారా?" అడిగాడతను.

"ఆ" అందామె.

ఆమెతో అతని పరిచయం కొద్దిదే. కాని ఆమె అసలు కొత్తగా ఫీల్ అయ్యేట్టు భయం భయంగా ప్రవర్తించటం లేదు. ఆమె తన గురించే మాట్లాడటం లేదు. అతని వ్యక్తిగత విషయాలు గురించి ప్రశ్నించనేలేదు. ఆమె తన ఇష్టాలు, తన భావాలు తను సాధించిన విజయాల గురించి ఒక్కమాట మాట్లాడలేదు.

ఆమె నిర్మల స్వభావానికి ముగ్ధుడై "మీ పాటలంటే చాలా ఇష్టం" చప్పున చెప్పాడు.

ఆమె చిన్నగా నవ్వి "థ్యాంక్యు" అంది.

ఒకానొక సాయంత్రం రికార్డింగ్ అయ్యాక రేడియో స్టేషన్ నుండి బయటికి వస్తున్న పల్లవికి శశిధర్ ఎదురై "ఇక్కడికొచ్చాక ఏం చూడలేదు. బిర్లా మందిర్ చూడాలను కుంటున్నాను, వస్తారా?" అడిగాడు.

"పదండి" అందామె.

ఇద్దరూ బిర్లామందిర్ చూసి బయటికి వచ్చేసరికి చిన్నగా తుంపర పడుతోంది. ఆమె బుగ్గలపై నిల్చిన నీటి బిందువులో రంగురంగులుగా మెరుస్తున్న మెర్క్యురీ దీపపు వెలుగుని చూస్తూ "ఏం కోరుకున్నారు దేముణ్ణి?" అడిగాడు శశిధర్.

"ఏం కోరుకోలేదు".

"అదేంటి?"

"బిర్లామందిర్‌కి రాకముందు నుండే నాకు కాఫీ తాగాలనుంది. అది మిమ్మల్ని అడగాలి కాని దేముణ్ణి అడిగితే తీరే కోరిక కాదుగా?" చిన్నగా నవ్వుతూ అందామె.

ఎదురుగా వున్న కామత్‌లో కాఫీ తాగి బయటికి వచ్చాక "రేపు మా ఇంటికి రండి. మీకిష్టమైన బంగాళదుంప కూరతో భోజనం పెడతాను" ఆహ్వానించిందామె.

"వస్తాను" చెప్పాడతను.

★ ★ ★

శశిధర్‌కి పల్లవితో తన మనసులో ప్రేమ ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు. అసలు ఆమె మనసులో తనేంటో తెలియక అతనికేం తోచటం లేదు. ఆలోచించి ఆలోచించి కథ రాసాడు.

పల్లవితో పరిచయం - కామత్ కాఫీ - బిర్లామందిర్ చల్లదనం - బుచ్చిబాబు చివరకు మిగిలేది - పల్లవి వడ్డించిన బంగాళాదుంప కూర - అన్ని రమ్యంగా రాసి, కథ అచ్చు కాగానే "స్ఫూర్తినిచ్చిన ఓ గోదావరికి" అని రాసి కథని పల్లవికిచ్చాడు శశిధర్.

కథ పూర్తిగా చదివి, 'భలేరాసారే తరచుగా రాస్తుండండి' మనస్ఫూర్తిగా అందామె.

తన గుండెల్లో చిటపటా చిరుమంట పల్లవికి అర్థం కాలేదా? అంత స్పష్టంగా రాస్తే అర్థం కాకపోవటమేంటి? ఇష్టంలేదా? పొగరా?? అహంకారమా???

★ ★ ★

ఓ సాయంత్రం వేళ అనుకోకుండా ముంగిట వాలిన పడమట పిట్టలా ఒద్దిగా ఇంటివాకిట నిలబడిన శశిధర్‌ని "రండి రండి" అంటూ చిర్నవ్వుతో ఆహ్వానించింది పల్లవి.

"పోస్టింగ్స్ సీతాపురంలో, గవర్నమెంట్ వుద్యోగం వచ్చింది. రేపు సాయంత్రం వెళుతున్నాను. ఉత్తరాలు రాస్తుంటాను" అని ఆమెకి చెప్పి హడావుడిగా వెళ్లిపోయాడు శశిధర్.

★ ★ ★

శశిధర్ పెద్ద పెద్ద ఉత్తరాలు రాసేవాడు. ఒక్కదాంట్లో కూడా సూటిగా ఆమెని తన జీవితంలోకి ఆహ్వానిస్తూ ఒక్క పదం కూడా రాయలేదు. ఆమె చాలా క్లుప్తంగా జవాబు రాసేది. అతనికి ఆమె తరహా విసుగేసింది.

ఓపక్క పెళ్లి చేసుకోమని తల్లిదండ్రుల వొత్తిడి. వాళ్లు చూపించిన కావేరిని పెళ్లి చేసుకోడానికి ఒప్పుకున్నాడు శశిధర్. అందరికి పంపినట్టే పల్లవికి ఓ శుభలేఖ పంపించాడు.

పల్లవి పెళ్లికి రాలేదు. గ్రీటింగ్స్ పంపలేదు.

కావేరి నచ్చిందని ఇకముందు గోదావరిని మర్చిపోతానని ఓ కథ రాశాడు. అంతేకాదు ఒకప్పుడు తనకి గోదావరి చాలా ప్రియమైనదని, ఇకముందు కావేరి మాత్రమే ప్రియమైనదని నోట్ రాసి మరీ ఆ కథ పల్లవికి పంపించాడు శశిధర్.

అతను మెదడుని శాసించగలిగాడు. కాని హృదయం పల్లవి రమ్య స్వరాలని, కాంతిచూపుల్ని, నిర్మలానురాగాన్ని శృతి చేస్తూనే వుంది.

ఇదంతా జరిగిన రెండేళ్లకి ఇప్పుడు తిరిగి ఈ నగరానికి ప్రభాకర్ పెళ్లికని రావటం.

ఆటో విడిదింటిముందు ఆగింది.

సాయంత్రపు గాలి మెత్తగా పల్కరిస్తుంటే రంగురంగుల దీపాల పెళ్లిపందిట్లో ఎదురైన పల్లవిని "బాగున్నారా?" అని పల్కరించాడు శశిధర్.

ఆమె అదోలా నవ్వి, "ఊ" అంది.

పల్లవి మాట్లాడకపోవటం గమనించి "డల్‌గా వున్నారేంటి?" అడిగాడు శశిధర్.

"గోదావరిని ఇష్టపడటం మానుకున్నారుగా ఎలా వుంటే ఏం?" బాధగా అందామె.

అతను బిత్తరపోయాడు. తను రాసిన కథ చదివిందన్నమాట.

అతను కాస్త తేరుకుంటు "ముందు కథ ఇష్టమని రాశాను".

"అవును. మరెందుకు ఇష్టం పోయింది?" నిలదీసిందామె.

"మీకు నేనెందుకు రాసానో అర్థం అయిందా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆఁ".

"మరెందుకు జవాబు చెప్పలేదు?"

"మీరు నన్నేం అడగలేదుగా?"

శశిధర్ తల గిర్ర్‌న తిరిగింది. ఆమెతో కలిసి తిరిగాను, ఆమెని ఎంతగానో ఆరాధించాను. కథలు రాసాను. కాని... కాని... ఒక్కసారికూడ స్పష్టంగా తన మనసులో ఏముందో ఆమెకి ఎందుకు చెప్పలేదు. కనీసం కావేరిని పెళ్లి చేసుకోడానికి ఒప్పుకునే ముందేనా పల్లవి అభిప్రాయం ఏంటో తెల్సుకోడానికెందుకు ప్రయత్నించలేదు?

"నన్నెందుకు అడగలేదు?" రెట్టించిందామె.

"మీరు తిరస్కరిస్తే?"

"ఏమవుతుంది తిరస్కరిస్తే?" అమాయకంగా అడిగిందామె.

అతను నిశ్చేష్టుడయ్యాడు. అవును. ఆమె తిరస్కరిస్తే ఏమవుతుంది?

మట్టిలో ఆడే తనని తల్లి వీపుపై కొడితే - ఎక్కాలు సరిగా అప్పచెప్పలేదని మాస్టారు చెవి మెలిపెడితే - స్కూల్ ఫస్ట్ రాలేదని తండ్రి ముఖం చిట్లిస్తే - అన్న టైమ్‌కి స్టేట్‌మెంట్ పూర్తి చెయ్యలేదని బాస్ కసురుకుంటే - చిల్లర లేదని కండక్టర్ బస్సు దిగమంటే - లేని - కలగని - అవమానం ప్రాణంగా మనసు మోముపై వలపుల పన్నీరు చిలకరించే భావాలు అలవోకగా స్ఫురింప చేసిన పల్లవి తనని తిరస్కరిస్తే ఏమవుతుంది? ఏమయ్యేది?

అహం!

ఆడది తిరస్కరిస్తే భరించలేని మగ అహం!

ప్రేమించే హృదయంలో ప్రేమ మాత్రమే వుండాలి. మనసులో అన్ని రుగ్మతలు చెరిపేసి మనసువిప్పి చెపితే ప్రేమ ఫలిస్తుంది. లేకపోతే మిగిలేది అసంతృప్తి. నిరాశ.

• వార్తాకాలం పక్షపత్రిక, *1–15* అక్టోబర్, *1991* •